# 25. భావి భారత బుద్ధులు

మా వాడి క్లాసు పుస్తకంలో బౌద్ధమతాన్ని గురించిన పాఠం ఒకటుంది. అది రాసినాయన ఏ రెండు మూడు సాహిత్య అకాడమీ అవార్డులు కొట్టేసిన బాపతో అయి ఉండాలి. బౌద్ధుల జీవకారుణ్యాన్ని బుడ్డోళ్ళ బుర్రల్లోకి సులువుగా ఎక్కించేందుకాయనగారు ఉదాహరణ పూర్వకంగా కథా కథనం చేశారు.

"బాలకులారా, చూడుడు. అల్లదిగో ఆ జపానీయ బాలుడు వంగి చేతనొక రాయి తీయుచున్నాడు. అయిననూ అతనికి అల్లంతదూరములోనే గల గజ్జికుక్క పారిపోవుట లేదేమి? ఏలననగా ఆ బాలునికి ఉగ్గుపాలతోనే బౌద్ధమునూరి పోయబడినది, అతడు అహింసావాది. జీవహింస చేయడు. కనుక, తనపై ఆ రాయి విసరడని ఆ కుక్కకు తెలియును."

సదరు పండితులవారి వివరణాత్మకతకు ఆనందించగలిగినా, ఓ అనుమానం రాకపోలేదు. ఆ బౌద్ధబుడ్డడు కుక్క తన మీదికి వచ్చినా సరే రాయి విసరడు గాక విసరడు. మరయితే శ్రమపడి ఓ రాయిని ఏరితీసి ఎందుకు హస్తభూషణుడైనాడూ? ఎవరూగానీ తమ బుర్రే బ్రద్దలు గొట్టుకునేందుకు

గాను రాళ్ళు ఏరరుగదా! అదలా ఉండగా భూతదయకు సుప్రసిద్ధమైనదని మన పండితులవారు శెలవిస్తున్న ఆ జపానీయుల దేశంలో అసలు గజ్జికుక్కలు ఎలా ఉండగలిగాయి?'' అని

సదరు పండితులవారికి తోచలేదేమో గానీ మనల్ని మించిన అహింసావాదులూ సహనశీలురూ మరెవరూ లేరు. మన కుర్రాళ్ళు అడపాదడపా రాళ్ళేగాకుండా నాటు బాంబుల్ని కూడా ఏరికోరి హస్తభూషణులవుతూనే ఉంటారు. అయినా జీవకారుణ్యం వంటబట్టిన వారు గనుక వాటిని తమను పీక్కుతినే తోడేళ్ళమీద గాకుండా బస్సులమీద విసరేస్తుంటారు అహింసాత్మకంగా. మరి మన విద్యార్థి, యువజనుల్ని మించిన బౌద్ధులూ, బుద్ధిమంతులూ ఇంకెవరున్నారు.

నా మట్టుకు నేను బియ్యే పరీక్షకు చదివే రోజుల్లో ఆ పుస్తకాల్ని బాయిలర్లో పడేసి వేణ్ణీళ్లు కాచుకుని శుభ్రంగా స్నానం చేసి హాయిగా నిద్రపోవాలనిపించేది. ఛాన్సు దొరకాలేగానీ ఆ పుస్తకాలు తయారుచేసిన పండిత పీనుగుల బుర్రలు బ్రద్దలు కొట్టాలనిపించేది. సదరు పనికి మాలిన చెత్తంతా చదివి చావమనే యూనివర్శిటీని భూమట్టం చేయాలనిపించేది. అయినా నేను గానీ నాతోటి వాళ్ళంగానీ ఈ ఘనకార్యాలేవీ చేయకుండానే బుద్ధిగా బియ్యే పాసయ్యాం. మా సహనం ముందా జపాన్ బుడ్డడి జీవకారుణ్యం ఓ లెక్కలోదా?

ఆ మధ్య మావాడొకడు జాబు రాశాడు. 'మావయ్యా! మెడికల్ కాలేజీవాళ్ళ ఎంట్రన్స్ ఎగ్జామ్సు అప్లికేషన్ ఫారం

ఒకటి సంపాయించి పంపు. నీ ఋణం ఉంచుకోనులే. నేను డాక్టర్నవగానే ముందుగా నీకే ఏ రోగం లేకున్నాసరే ఆప రేషన్ చేస్తాను సరా!" అని

ఎందుకేనా మంచిదని ఆ మర్నాడు ఉదయమే కాలేజీ తెరిచేందుకింకా రెండు గంటల పైముండగానే అక్కడ హాజరయ్యాను. కానీ, అప్పటికే దొమ్మిలాంటిదేదో జరుగుతున్నట్టున్నది. కొన్ని వందల మంది విద్యార్థులు మందలు మందలుగా ఉన్నారక్కడ. ఇంతలో ఓ రెండు లారీ ల్నిండా పోలీసులు దిగారు, అరగంటలో ఆ మందలన్నీ కలసి ఓ కిటికీ ముందు క్యూగా మారాయి. అక్కడ అప్లికేషన్ ఫారాలిస్తారట.

మన భావిపౌరుల, రేపటి డాక్టర్ల క్రమశిక్షణకు సంతో పిస్తూ క్యూలో ఏడొందల ఎనభై ఒకటోవాడినిగా హాజరు వేయించుకున్నాను. ఇంతలో ఆ క్యూ కాస్తా చెల్లాచెద రయింది. మరో మూలనున్న బిల్డింగ్ వేపుగా కుర్రాళ్ళు పరుగులు తీయసాగారు. నా ముందున్న స్టూడెంటు నన్నడి గాడు "ఏమిటి ఎవరేనా సినిమాతారగానీ అప్లికేషన్ ఫారం కోసం రాలేదుగదా! వీళ్ళంతా అటు పరుగెడుతున్నారే ?" అని.

నేను మరో క్యూ కార్యమేదు నడిగేను, వాడు ఇంకో కార్యమేదుని అడిగేడు. వాడింకొకణ్ణి! మొత్తంమీద అందరూ

కలసి అలే పరుగెత్తేరు. అప్లికేషన్ ఫారాలమ్మేది ఇక్కడ కాదట, అక్కడట కాళ్ళీడ్చుకుంటూ నేనూ సదరు క్యూలో చేరేసరికి తొమ్మిమ్మిదొందల తొంభై రెండో వాడినయ్యేను.

ఆఫీసులు తెరిచే టైము దాటి అరగంటయింది. అయినా క్యూ కదలడంలేదు. ఫారాలమ్మే క్లర్కు ఇంకా దయచెయ్య లేదట. క్యూలో నా వెనకాల మరో రెండొందల మంది చేరేరు. పల్లీలు అమ్మేవాళ్ళూ, సిగరెట్లమ్మేవాళ్ళేగాక ఓ మినీ మొబైల్ చాయ్ దుకాణంవాడు కూడా తయారయ్యేడు. క్యూ కదలడం లేదుగానీ బిజినెస్ మాత్రం జోరుగా సాగుతోంది "అలాపోయి కాస్త మంచి కాఫీ సేవించి వద్దామా?" అనడిగేడు నా ముందున్న విద్యార్థి కామ్రేడు తన ముందున్నవాడిని. "నేనింకా మొహం కడుక్కోలేదురా భాయీ! పెందరాళేవస్తే క్యూలో మొదటివాణ్ణి కావచ్చునని పళ్ళుతోముకోకుండానే వచ్చేశాను!" అన్నాడా రెండో కామ్రేడ్.

"అరే! నువ్వింకా కాఫీకూడా త్రాగలేదా!"

"లేదురా నాయనా! ఇవ్వాళేగాదు. గత నాలుగయిదు రోజుల్నించీ ఇంతే! పెందరాళే తగలడి క్యూలో నిలబడ్డా నాకింకా ఫారం దొరకనేలేదు!" అన్నాడా మొదటి కామ్రేడు. చివరికి వాళ్ళిద్దరూ కలసి తమ జాగాకు నన్ను కాపలాదారుగా నియమించి కాఫ్యార్థులై వెళ్ళేరు.

కార్లొస్తున్నాయ్! జీపులొస్తున్నాయ్! రిక్షాలొస్తున్నాయ్! తిరణాలకన్నా అడావిడిగా, సంతకన్నా కోలాహాలంగా వుంది కాలేజీ ఆవరణం. అనేక రకాల విద్యార్థులు అడావిడిగా తిరుగుతున్నారు. కౌబాయ్‌గాళ్ళు, బెల్ బాటం గాళ్ళు హిప్పీ క్రాపుగాళ్ళు, రెండుజడలవాళ్ళు, మూరెడు చీరలవాళ్ళు, జానెడు జాకెట్లవాళ్ళు... ఓహ్!

వెధవది ఓ రోజు ఆఫీసు పోతేపోయింది ఇంతమంది, ఇన్ని రకాలవాళ్ళతో కలిసిమెలిసి క్యూలో కాలక్షేపం చేసే అవకాశం కలిగిందిగదా అని నేను సంతోషించేను. అంతవరకూ పడిగాపులు పడి పట్టించుకున్న నీరసాన్ని నెట్టివేయజూచేను.

నా ముందు కామ్రేడొకడు మూలిగేడు. "ఇప్పటికే గంటాలస్యమయింది. ఇంకా బుకింగ్ తెరవరేమిట్రా! దొంగ రాస్కెల్స్!" అని. అతని ఫ్రెండొకడు పెద్ద నల్లద్దాలు ధరించినవాడు. చెంపలు దట్టంగా పెంచినవాడు, తిరుపతి మొక్కుబ్రాండు క్రాపుగలవాడు, వడ్డాణంలాంటి వెడల్పాటి బెల్టొకటి ధరించిన వాడు చిరుదరహాసంతో శకునం పలికేడు.

'ప్రొద్దున్న రేడియోలో విన్నాను. దండకారణ్యం గవర్నరుగారి కారుకు ఆక్సిడెంటయిందిట. కొంపదీసి ఈ వేళ ఆఫీసులకుగానీ శెలవుకాదుగదా!' అని.

'కాదులే' కార్లు విరిగితే శెలవివ్వరు! కార్లోవాళ్ళు విరిగితే శలవిస్తారు. అన్నాడా రెండో కామ్రేడ్.

నాకో అనుమానం వచ్చింది. 'ఉన్న డాక్టర్లకే ఉద్యోగాలు లేవని గోలపెడుతున్నారే! చదివేవాళ్ళు కాలేజీ ఫీజులు భరించలేకున్నామని వాపోతున్నారే, హౌస్ సర్జన్‌లు తమకిచ్చే ఎలవెన్సు ముష్టికన్నా అన్యాయంగా ఉందని సమ్మెలు చేస్తున్నారే, మరి ఈ మాత్రపు కోర్సుకోసం ఇన్ని వేలమంది ఇలా ఎగబడుతున్నారేమిటి ?' అని.

ఆ మాట ఎవర్నైనా అడిగితే నన్ను పిచ్చాసుపత్రికి పంపినా పంపవచ్చు. బహుశా ఇది కలవారి బిడ్డల జాతర లెమ్మని సరిపెట్టుకోబోయాను. కానీ, ఆ గుంపుల్లో మాసిన గుడ్డలవాళ్ళూ ఉన్నారు. తెగిన చెప్పులవాళ్ళూ ఉన్నారు. చేతిసంచులతో రైలు దిగి సరాసరి ఇక్కడికే వచ్చిన పొరుగూరి రైతుబిడ్డలున్నారు. చదువుమీది మోజు అందరి మొహాల్లోనూ ఎంతో కొంత కనపడుతూనే ఉంది. అందువల్ల అంత మాట అనుకోలేకపోయాను.

ఇంతలో అంత పొడవు క్యూ కాస్త చెల్లాచెదురై పోయింది. ఓ బుష్‌షర్టువాలా మేడమీదనుండి అరుస్తున్నాడు, "కాప్రేడ్స్, ఫారాలన్నీ నిన్నే అయిపోయాయి. మళ్ళీ అచ్చుకిచ్చాం, ఈ రాత్రికొస్తాయి. మీరంతా రేపి ప్రైముకు ఇక్కడే క్యూలో తగలడండి ఫారాలిస్తాం" అని.

నన్ను జైల్లో పెట్టేవాడెవడూ లేకుంటే వాడిని పట్టుకుతన్నాలనిపించిన మాట నిజమే. కానీ, కొందరు ఏడుపుముఖా

లెట్టుకునీ, మరికొందరు బూతులు తిట్టుకుంటూనూ బయట పడ్డారుగానీ ఎవరూకూడా అలాంటి దారుణప్పని చేయలేదు.

చెప్పొచ్చేదేమిటండీ, మనల్ని మించిన సహనశీలురూ, జీవకారుణ్యవాదులూ మరెవరూ లేరని.

ఆ మర్నాడు మా ప్యూనుని బ్రతిమాలి వాడికో రూపాయి కాఫీ ఖర్చుకిచ్చి ఫారం తెమ్మని పంపేను. వాడో అరగంటలో ఫారంతో తిరిగొచ్చాడు. వాడు అసాధ్యుడని నాకు తెలుసు. అయినా ఉండబట్టలేక అడిగాను. 'ఇంత తేలిగ్గా ఫారం ఎలా దొరికిందిరా అని.

వాడు మందహాసం చేశాడు. 'మీరిచ్చిన రూపాయిగాక మరో రెండు ఖర్చయ్యాయి. ముందా రూపాయలిలా పడేయండి సార్!' అన్నాడు వాడు.

(అక్టోబరు 1978)